క్లుప్తంగా

క్షయ నిర్మూలనే లక్ష్యం



మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ : క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని వైద్యాధికారి దివాకర్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఈ మేరకు సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తోందన్నారు. క్షయ అంటు వ్యాధని, రోగులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. టీబీ నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యాధికారిగా విద్యాసాగర్‌రావు



బుచ్చినాయుడుకండ్రిగ : బీఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిగా విద్యాసాగర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యవేడు పీహెచ్‌సీ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తానని తెలిపారు.

తుపాన్ బాధితులను ఆదుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి: తుపాన్ బాధితులను ఆదుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణను శుక్రవారం సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ రెండురోజులగా కురిసిన వర్షానికి శ్రీకాళహస్తి మండలం ముళ్లపూడి, వేడాం, చుక్కలనిడిగల్లు గిరిజనకాలనీలు, పట్టణంలోని ఈశ్వరయ్య కాలనీ, చెంచు లక్ష్మీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరాయన్నారు. దీంతో వారు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రభుత్వం తరపున వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మించల శివకుమార్, మునిరాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్, అధికారులు

వరదయ్యపాళెం: పల్లె పండుగలో భాగంగా శుక్రవారం స్థానిక బీసీకాలనీ, గోపాలరావుకాలనీల్లో రూ. 26లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, వైస్ సర్పంచ్ చంద్రబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్, మాజీ ఎంపీపీ భారతమ్మ, మైనారిటీ నేత నవాబు, ఈఓ బసిరెడ్డి పాల్గొన్నారు.

గుంతలతో వాహనచోదకులకు ఇక్కట్లు



వికృతమాల వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పడిన గుంతలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట నుంచి ముసలిపేడు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పడిన గుంతలతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆ గుంతల్లో నీరు చేరింది. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల్లో వెళ్లడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రజలు అంటున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

రేణిగుంట: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం రేణిగుంటలోని ప్రధాన వీధులు, రైల్వే స్టేషన్, పోస్ట్ ఆఫీస్ వీధుల్లో వన్‌వే పార్కింగ్ చేయించారు. అలాగే పలు వాహనాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

పీహెచ్‌ఛీ



- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత
- ఇబ్బంది పడుతున్న రోగులు

ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు.. పేదల పాలిట ఆరోగ్య నిలయాలు. జ్వరమొచ్చినా..జలుబు చేసినా..గాయపడినా పేదోడు పరుగు పెట్టేది పీహెచ్‌సీకే. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకే జబ్బు చేసి కునారిల్లుతున్నాయి. అనారోగ్యంతో ఆరోగ్య కేంద్రాలకు వెళితే వైద్యం అందుతుందో లేదోనన్న ప్రశ్న వేధిస్తోంది. ఓ వైపు సదుపాయాల లేమి.. మరో వైపు మందుల కొరత.. ఇంకో వైపు వైద్యులు, సిబ్బంది లేమితోపాటు ఉన్నవారు సైతం సమయ పాలన పాటించకపోవడం సామాన్యులకు శాపంగా మారింది. సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో శుక్రవారం సాక్షి పరిశీలనలో ఈ విషయం తేటతెల్లమైంది.

- అందుబాటులో లేని మందులు
- సక్రమంగా విధులకు హాజరుకాని డాక్టర్లు
- రోగమొస్తే ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు



వరదయ్యపాళెం: నాగలాపురం పీహెచ్‌సీలో ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న మందుల పంపిణీ స్టోర్

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలోని చిన్న పాండూరు, నాగలాపురం, బీఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు సక్రమంగా వైద్యసేవలు అందడం లేదు. రాత్రిపూట వైద్యులు అందుబాటులో ఉండడం లేదు.

తగినన్ని మందులు లేవు

24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉండాల్సి చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం సక్రమంగా మందులు సరఫరా చేయడం లేదు. శ్రీసిటీ సమీపంలో ఉండడంతో పెద్దసంఖ్యలో రోగులు వైద్యం కోసం చిన్న పాండూరు పీహెచ్‌సీకి వస్తుంటారు. అయితే అక్కడ సరిపడా మందులు లేకపోవడంతో రోగులు ఇక్కట్లు పడుతున్నారు. ఆస్పత్రిలో స్టాఫ్ నర్సు మెటర్నటీ లీవ్‌లో ఉన్నారు. ఆమె స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1.87 కోట్లు వెచ్చించి పీహెచ్‌సీకి అన్ని హంగులతో నూతన భవనం నిర్మించారు. అయితే కూటమి సర్కారు చిత్తశుద్ధి లోపించడంతో పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదు.

నాగలాపురంలో..

- ల్యాబ్ టెక్నీషియన్ లేని కారణంగా రక్త పరీక్షలను ప్రైవేట్‌గా చేయించుకోవాల్సిన దుస్థితి.
- ఈ క్రమంలోనే ఫార్మాసిస్ట్ పోస్ట్ సైతం ఖాళీగా ఉంది.
- రెండో స్టాఫ్ నర్సు పోస్టు కూడా ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. దీంతో నామమాత్రపు వైద్యసేవలకే పీహెచ్‌సీ పరిమితమైంది.

గ్రామీణ వైద్యం.. గాలిలో దీపం

రేణిగుంట: గ్రామీణ వైద్యం గాలిలో దీపమైంది. మారుమూల గ్రామాల్లో చిన్నపాటి జ్వరమొచ్చినా మందుబిళ్ల ఇచ్చే నాథుడే లేడు. విలేజ్ క్లినిక్‌లలో సిబ్బంది కూడా కనిపించే పరిస్థితి లేదు. మందులు కూడా అరకొరగా ఉండటంతో రోగులకు ప్రైవేటు ఆస్పత్రులే దిక్కయ్యాయి. రేణిగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నారు. 21 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో పని చేసే సిబ్బందిపై పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఎప్పుడుంటారో తెలియని పరిస్థితి.



రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇక పీహెచ్‌సీలో కూడా మందులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఇక్కడ వాచ్‌మెన్, స్వీపర్ లేకపోవడంతో సిబ్బందే ఆస్పత్రి ప్రాంగణం శుభ్రం చేసుకుంటున్నారు. శుక్రవారం పీహెచ్‌సీని పరిశీలించగా, కొందరు రోగులకు ఓ వైద్యాధికారి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కొందరికి ఆస్పత్రిలో సెలైన్ పెట్టారు. మరో వైద్యాధికారి మండలంలోని ఎర్రమరెడ్డిపాళెంలో హెల్త్ క్యాంప్ నిర్వహించి అక్కడ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

- శ్రీకాళహస్తి మండలంలోని ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు డాక్టర్లున్నా వారిలో ఒకరు ప్రమోషన్ రావడంతో వెళ్లిపోయారు. వారి స్థానంలో మరొక వైద్యులు డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై విమర్శలున్నాయి. ఇక్కడ డాక్టర్లు, సిబ్బంది ఎప్పుడొస్తారో.. ఎప్పటి వరకు ఉంటారో కూడా తెలియని పరిస్థితి. అలాగే తొట్టంబేడు మండలం తొట్టంబేడు, కాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మందుల కొరత, ల్యాబ్‌లు పని చేయకపోవడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు.

దాసుకుప్పం పీహెచ్‌సీలో సిబ్బంది కొరత



దాసుకుప్పం పీహెచ్‌సీలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ గుణశేఖర్

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సు, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం ఇద్దరు డాక్టర్లు విధులకు హాజరయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 70 మంది రోగులకు చికిత్సలందించారు. ఇక్కడి ల్యాబ్‌లో రక్త, మూత్ర, హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పీహెచ్‌సీలో తాగునీటి వసతి కల్పించారు. పాము, తేలు, కుక్క కాటుకు మందులు అందుబాటులో ఉంచారు.

బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక పీహెచ్‌సీలో సూపర్‌వైజర్, పబ్లిక్ హెల్త్ నర్స్ పోస్టులు భర్తీ చేయలేదు. వర్షాల నేపథ్యంలో జ్వరపీడితులు బారులు తీరుతున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.



బీఎన్ కండ్రిగ పీహెచ్‌సీలో రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి విద్యాసాగర్‌రావు

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట, ఏర్పేడులో పీహెచ్‌సీలు, 19 విలేజీ హెల్త్ క్లినిక్ కేంద్రాలు ఉన్నాయి. శుక్రవారం సాక్షి పరిశీలనలో పీహెచ్‌సీలు, విలేజీ హెల్త్ క్లినిక్‌లలో కొన్ని లోపాలను గుర్తించారు. శుక్రవారం ఏర్పేడు పీహెచ్‌సీలో 68 మంది, పాపానాయుడుపేట పీహెచ్‌సీలో 55 మంది రోగులు చికిత్స కోసం వెళ్లారు. ఏర్పేడు పీహెచ్‌సీ ఓపీలో ఒక డాక్టర్, 104 వాహన సేవల కోసం గ్రామాలకు మరో డాక్టర్ వెళ్లారు. పాపానాయుడుపేట పీహెచ్‌సీలో ఓ డాక్టర్ మధ్యాహ్నం 1.30 గంటలకే పీహెచ్‌సీ నుంచి వెళ్లారు. దీంతో పీహెచ్‌సీలో డాక్టర్ కుర్చీ ఖాళీగా ఉండడంతో రోగులకు స్టాఫ్ నర్సు వైద్యసేవలను అందించారు. మరో డాక్టర్ 104 సేవలను అందించడానికి కుక్కలగుంటకు వెళ్లారు. పాపానాయుడుపేట, ఏర్పేడు పీహెచ్‌సీలలో తరచూ డాక్టర్లు అందుబాటులో ఉండరనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్ నాగరాజును వివరణ కోరగా శుక్రవారం తిరుపతి వైద్య శాఖ కార్యాలయం అధికారుల ఆదేశాల మేరకు అక్కడికి మధాహ్నం పై వెళ్లినట్లు చెప్పారు. రెండు పీహెచ్‌సీల్లో ఐ డ్రాప్స్, పలు రకాల మందులు, ఆయింట్‌మెంట్స్ కొరత ఉంది.

గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టని వైద్య శాఖ

తుఫాను ప్రభావంతో గ్రామాల్లో మురుగునీరు చేరి దోమలు విపరీతంగా చేరాయి. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మురుగునీటిలో బ్లీచింగ్, మొలాథీన్ స్ప్రే లాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. వికృతమాల రెవెన్యూలోని మద్రిమంద జగనన్న కాలనీలో వర్షానికి మురుగునీరు చేరింది. పాపానాయుడుపేట పీహెచ్‌సీ, పంచాయతీ అధికారులు ఎలాంటి పారిశుద్ధ్య పనులు చేపట్టలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఏర్పేడు పీహెచ్‌సీలో గర్భిణికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ గిరిజ



పాపానాయుడుపేట పీహెచ్‌సీలో విద్యార్థినికి హిమోగ్లోబిన్ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరానికి విశేష స్పందన

శ్రీకాళహస్తి: పట్టణంలోని నల్లగంగమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం రాస్, టాటా ట్రస్టు క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనంలో మనిషి తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడన్నారు. క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించి చికిత్సలు పొందితే నయం చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం మహిళలు, పురుషులకు బీపీ, షుగర్, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ వైద్య పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్టు వైద్యులు వెంకయ్యబాబు, రెడ్డికుమారి, మెహతాజ్, మహేంద్ర, రాస్ సిబ్బంది ముకేష్‌కుమార్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతు కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడు కండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలో కేంద్రంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ రమేష్ చంద్ర, జూనియర్ ఇంజనీర్ పృథ్వీ తెలిపారు. సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం సరఫరా నిలుపుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెరుగైన పాలనకు సహకారం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి

సత్యవేడు: పంచాయతీల్లో సర్పంచులు మెరుగైన పాలన అందించేందుకు ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు సహకారం అందించాలని జెడ్పీటీసీ సభ్యులు పి. విజయలక్ష్మి కోరారు. శుక్రవారం సత్యవేడులో ఉపసర్పంచులు, వార్డు మెంబర్ల రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. విస్తరణాధికారి తరుణాక్షరెడ్డి మాట్లాడుతూ ఉప సర్పంచులకు హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్. చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ మునిరవికుమార్ పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి నిధులు

సత్యవేడు : ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ పరిధిలో 12 డ్రైనేజీల నిర్మాణానికి రూ.66లక్షలు మంజూరైనట్లు డీఈ శైలజ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పల్లె పండుగలో భాగంగా ఉపాధి పథకం కింద ఈ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ పురాణ ఇతిహాస విభాగం ఆధ్వర్యంలో ఆదికవి వాల్మీకి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ జీఎస్ఆర్ కృష్ణ మూర్తి వర్సిటీ ఆవరణలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

శాస్త్రోక్తంగా శుక్రవార ఉత్సవం



జ్ఞానప్రసూనాంబ ఊరేగింపు


శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా శుకవార ఉత్సవం నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఉత్సవమూర్తికి అలయ అలంకార మండపంలో విశేష అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి ఆలయ ప్రాకారంలో శుక్రవార ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సెక్యూరిటీపై దాడికి యత్నం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాయ దక్షిణగోపురం, తిరుమంజన గోపురం వద్ద ఇద్దరు మైనర్ బాలికలు, నలుగురు యువతులు పుస్తకాలు విక్రయిస్తుంటారు. భక్తులను ఇబ్బందిపెట్టడం చూసి ఓ మహిళా సెక్యూరిటీ గార్డు వారిని మందలించింది. వెంటనే వారు గుమికూడి ఆమెపై దాడికి యత్నించారు. బడికి వెళ్లాల్సిన వయసులో ఇలా భక్తులతో చెలగాటమాడడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.



మేత భూములు కాపాడాలని వినతి



వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో ఆక్రమణకు గురవుతున్న మేత బీడు భూములను కాపాడాలని సర్పంచ్ సాయిరెడ్డి కోరారు. శుక్రవారం ఈ మేరకు తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు.10 ఎకరాల మేత భూములను స్థానిక టీడీపీ నేత ఆక్రమించుకుని దున్నకాలు చేపట్టాడని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ సంబంధిత భూములను పరిశీలించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రూఅప్ చార్జీల భారం మోపొద్దు





శ్రీకాళహస్తి: సీపీఎం నేతల నిరసన, బుచ్చినాయుడుకండ్రిగ : ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

శ్రీకాళహస్తి: ప్రజలపై ట్రూఅప్ పేరుతో విద్యుత్ చార్జీల భారం మోపొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరిపుల్లయ్య అన్నారు. పెంచిన ట్రూఅప్ చార్జీలకు వ్యతిరేకంగా పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ ఖజానాను నింపుకోవడానికి ట్రూఅప్ ఛార్జీల పేరిట వచ్చే పదేళ్లకు రూ.8,104 కోట్లు ప్రజలపై భారం మోపనుందన్నారు. ఓ వైపు ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఇలా చార్జీల మోత మోపడం సరికాదన్నారు. వెంటనే దానిని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంధం మణి, షరీఫ్, కుమార్, వెలివేంద్రం, వేణు తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీల భారంపై ధర్నా

బుచ్చినాయుడుకండ్రిగ : ట్రూఅప్ పేరుతో ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం మోపుతోందని సీపీఎం నేతలు ఆరోపించారు. శుక్రవారం ఈ మేరకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. సీపీఎం మండల కార్యదర్శి నలుగూరి రమణయ్య మాట్లాడుతూ ఇంధన సర్దుబాటులో భాగంగా ప్రజల నడ్డివిరవడం సరికాదన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యుడు పస్తులు ఉండాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం లైన్ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సుబ్బయ్య, ఏసుదాసు, శ్రీనివాసులు, వెంకటేశులు, రమేష్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి: అబ్దుల్ కలాం ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2024 సెకెండ్ లెవల్ చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన ఎంజీఎం విద్యార్థులు సత్తా చాటారు. చెన్నైలో జరిగిన ఈ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో తేజో మారుతీప్రసాద్ రాష్ట్రస్థాయి రెండో బహుమతి పొందాడు. అండర్-12 బాలికల విభాగంలో మీనాక్షి మూడో బహుమతి సాధించింది. వీరిని ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఐశ్వర్య

వెస్ట్ వరత్తూరులో నీట మునిగిన వరిపంట



గుంతలమయంగా ఆలత్తూరు రోడ్డు



వర్షం.. తీరని నష్టం

- నీట మునిగిన పంటలు
- ఆవేదనలో అన్నదాతలు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు
- దెబ్బతిన్న రహదారులు
- రాకపోకలకు అవస్థలు

బుచ్చినాయుడుకండ్రిగ: వాయుగుండం ప్రభావంతో మూడు రోజుల పాటు ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతో మండలంలోని కారణి, వెస్టువరత్తూరు, నెలవాయి, కనమనంబేడు, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం, కమ్మవారికండ్రిగలో రైతులు సాగుచేసిన సుమారు 2,500 ఎకరాల్లోని వరి పంట నీట మునిగింది. రెండు రోజులుగా వరదలోనే పైరు మగ్గుతోంది. అలాగే 450 ఎకరాల్లో వేసిన విత్తనాలు మొలకెత్తని దుస్థితి దాపురించింది. ఈ క్రమంలో అన్నదాతలకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని రైతాంగం కోరుతోంది. అలాగే మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, జీఎస్‌కండ్రిగ, ఆర్.అనంతాపురం, జంబుగోళం, పెద్దపాలేడు, గాజులపెళ్లూరు గ్రామాలకు వెళ్లే వెళ్లే రహదారులు గుంతలమయంగా మారిపోయాయి. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఆర్టీసీ బస్సులు సైతం నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామీణులు కోరుతున్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని విన్నవిస్తున్నారు.



కనమనంబేడులో..



గాజుల పెళ్లూరులో..



కుక్కంబాకంలో..